క్లుప్తంగా

సహస్ర శివలింగాలకు దీపార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తికమాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారికి ఆదివారం పంచామృత అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన జరిగింది. సహస్ర శివలింగాలకు అభిషేకాలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు విశేషంగా అలంకరించి దీపార్చన నిర్వహించారు. ఆలయ వైదిక కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆది దంపతులకు దీపార్చన చేశారు. దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించగా, ఉత్సవ మూర్తుల వద్ద ఏర్పాటు చేసిన దీపార్చనను భక్తులు, ఆలయ అధికారులు, సిబ్బంది వెలిగించి సేవలో పాల్గొన్నారు.

భక్తిగీతాల ఆలాపన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ధర్మపథంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ మహాసత్సంగం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అమ్మవారి సన్నిధిలోని కళావేదికపై పలు భక్తిగీతాలను ఆలపించారు. రిషి దేవ ప్రీత్, సాధిక అమృతభారతి సారథ్యంలో ధీరజ్, ప్రత్యూష, రఘువీర, శ్రావణి, ఇందిరా, రామకృష్ణ పలు భక్తి గీతాలను ఆలపించారు. భక్తి సంగీత ప్రచార కార్యక్రమంలో భాగంగా తొలుత కళాకారులు బ్రాహ్మణవీధి నుంచి పాదయాత్రగా అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. వేదికపై ఆలపించిన భక్తిగీతాలు భక్తులకు విశేషంగా అలరించాయి. అనంతరం కళాకారులను ఆలయ ఈవో రామరావు ప్రశంసించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు. తొలుత కళాకారుల బృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు.

నేడు వీఎంసీలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలకసంస్థ కల్పిస్తున్న మౌలిక వసతుల్లో తలెత్తే సమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదులు - పరిష్కారం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయాల్లో జోనల్ కమిషనర్లు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

దుర్గమ్మను దర్శించుకున్న టీటీడీ సభ్యులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను టీటీడీ బోర్డు సభ్యులు అనుగోలు రంగశ్రీ దంపతులు, తమ్మిశెట్టి జానకీదేవి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన టీటీడీ బోర్డు సభ్యులకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం టీటీడీ బోర్డు సభ్యులకు వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రామరావు, ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

13న విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్యార్థులకు చిత్రలేఖనంపై ఆసక్తి కలిగించడానికి బాలల దినోత్సవం సందర్భంగా డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ చైర్మన్ పి.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 తేది జరిగే ఈ డ్రాయింగ్ పోటీలను అనంత్ డైమండ్స్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. 13వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి రమేష్ ఆస్పత్రి రోడ్డులోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల ఆవరణలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. డ్రాయింగ్ షీట్ అందజేస్తామని, కలర్స్ విద్యార్థులే తెచ్చుకోవాలని, పోటీల్లో విజేతలకు బహుమతులతో పాటు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. పోటీల్లో విజేతలకు ఈ నెల 17న స్పా కళాశాల ఆవరణలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

దుకాణాలపై పచ్చనేతల కన్ను

- కాళేశ్వరరావు మార్కెట్‌లో 15దుకాణాల నిర్మాణానికి చర్యలు
- నిర్మాణం ప్రారంభం కాకుండానే బేరసారాలు
- టెండర్లు లేకుండా కేటాయింపునకు పచ్చనేతల ప్రయత్నాలు
- పచ్చనేతలకు అండగా పశ్చిమ ప్రజాప్రతినిధి కార్యాలయం


కాళేశ్వరరావు మార్కెట్‌లో దుకాణాల నిర్మాణం చేపట్టనున్న ప్రదేశం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాళేశ్వరరావు మార్కెట్‌లో కొత్తగా నిర్మించ తలపెట్టిన దుకాణాలపై పచ్చనేతల కన్ను పడింది. ఇప్పటికే నియోజకవర్గంలో కూటమి నేతలు కొనసాగిస్తున్న దందాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుండటంతోపాటు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతున్న విషయం తెలిసిందే.

అదే క్రమంలో పచ్చనేతలు కొంతమంది కాళేశ్వరరావు మార్కెట్‌లో నిర్మించ తలపెట్టిన దుకాణాలపై దృష్టి సారించారు. దుకాణాల నిర్మాణం మొదలుగాకముందే పచ్చ నేతలు కొంతమంది లక్షలాది రూపాయల దోపిడీకి సమయత్తమవుతున్నారని మార్కెట్‌లోని వ్యాపారులు గుసగుసలాడుకుంటున్నారు. స్థానికంగా ఉన్న కూటమి నేతలతో పాటుగా టీడీపీకి చెందిన నియోజకవర్గ నాయకులు సైతం అండగా నిలవడంతో గడిచిన వారం పదిరోజులుగా మార్కెట్‌లో షాపుల కోసం జోరుగా బేరసారాలు సాగుతుండటం గమనార్హం.

బేరసారాలు నడుపుతున్న పచ్చ నేతలు

కాళేశ్వరరావు మార్కెట్‌లో నూతనంగా చేపట్టనున్న దుకాణాలకు అప్పుడే పచ్చనేతలు బేరసారాలు సాగిస్తున్నారు. దుకాణానికి ఇన్ని లక్షలంటూ మార్కెట్‌లో బేరాలు మొదలుపెట్టారు. స్థానికంగా నాయకులుగా ఉన్న పచ్చ నేతలు ఈ బేరసారాలకు తెరలేపినట్లుగా స్థానిక వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. ఈ బేరసారాలకు పశ్చిమ నియోజకవర్గ ప్రజాప్రతినిధి కార్యాలయం నుంచి అండదండలు ఉన్నాయని నగరపాలకసంస్థలో జోరుగా ప్రచారం సాగుతోంది.

నిర్మాణం మొదలుగాక ముందే దుకాణాలకు బేరం పెట్టి లక్షలాది రూపాయలు దండుకోవడానికి సిద్ధ పడుతుండటంపై మార్కెట్‌వర్గాల్లో విమర్శలు వినిపిస్తున్నాయి.

దుకాణాలకు టెండర్లు పిలవాలి

మార్కెట్ ప్రాంగణంలో నిర్మాణం చేసే దుకాణాలు పూర్తయిన తరువాత టెండర్లను ఆహ్వానించి పాటదారులకు మాత్రమే దుకాణాలను అప్పగించాలని స్థానిక వ్యాపారులు కోరుతున్నారు. ఇలా ముందస్తు బేరసారాలు నడిపి దుకాణాలను అప్పగిస్తే నగరపాలకసంస్థకు భారీగా నష్టం వాటిల్లుతుందని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు. ఈ విషయంపై నగరపాలకసంస్థ కమిషనర్ దృష్టి సారించి, ఇప్పటికే సాగుతున్న దుకాణాల కేటాయింపు బేరసారాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

15 దుకాణాల నిర్మాణానికి ప్రణాళిక

నగరంలోని పేరుగాంచిన కాళేశ్వరరావు మార్కెట్ ప్లాట్‌ఫారం మీద కూరగాయల విక్రయాలు చేసే ప్రాంతానికి సమీపంలో మొన్నటి వరకూ సులభ్ కాంప్లెక్స్ ఉండేది. సులభ్ సంస్థకు సంబంధించిన 30 ఏళ్ల కాంట్రాక్ట్ ముగియడంతో కొద్దినెలలుగా అక్కడి కార్యకలాపాలు నిలిచిపోయాయి. దీంతో సులభ్ కాంప్లెక్స్ భవనాన్ని తొలగించి ఆస్థానంలో 15 దుకాణాలను నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. వాటితో పాటుగా మరో ఆరు దుకాణాలను సైతం ఆ నిర్మాణానికి పక్కనే చేపట్టాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ నిర్మాణాలకు సంబంధించి త్వరలో టెండర్లను పిలవనున్నట్లు నగరపాలకసంస్థ అధికారులు చెబుతున్నారు.

పాత్రికేయులు సమాజంపై బాధ్యతతో మెలగాలి


మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): పాత్రికేయులకు సమాజంపై బాధ్యత ఎంతో ముఖ్యమని ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు, సాహితీవేత్త కె.శ్రీనివాస్ సూచించారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు అధ్యక్షతన శ్రీనివాస్‌తో గెట్ టు గెదర్ కార్యక్రమం జరిగింది. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. తన పాత్రికేయ ప్రస్థానం విజయవాడలో సబ్ ఎడిటర్‌గా మొదలైందని గుర్తుచేసుకున్నారు. ఈ ప్రాంతంతో తనకెంతో అనుబంధం, ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయని పేర్కొన్నారు. వృత్తి పరంగానే కాక, సాహిత్యపరంగా, పుస్తక ప్రదర్శన కోసం విజయవాడకు వస్తూ ఎంతోమంది మిత్రులను సంపాదించుకున్నానని వివరించారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణ వాసిగా ఆ ప్రాంతానికి అనుకూలంగా వ్యవహరిస్తానని కొందరు అనుమానం వ్యక్తం చేశారని, విభజన తర్వాత రెండు రాష్ట్రాలకు ఒకే సంపాదకుడిగా కొనసాగడంపైనా పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశారని గుర్తు చేసుకున్నారు. పాత్రికేయులు ఏ స్థాయిలో ఉన్నా నిత్యం నేర్చుకుంటూ ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో పరిశోధనాత్మక జర్నలిజం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వాల్లో అవినీతి జరుగుతోందని ప్రజలకూ తెలుసని అభిప్రాయపడ్డారు. సభాధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు మాట్లాడుతూ.. కె.శ్రీనివాస్ సంపాదకుడిగా, జర్నలిస్టుగా, సాహితీవేత్తగా తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితులని కొనియాడారు. శ్రీనివాస్ దంపతులను సీనియర్ పాత్రికేయులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐజేయూ కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ అర్బన్ అధ్యక్షుడు చావా రవి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్, కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన సీనియర్ జర్నలిస్టులు, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సేవలు అభినందనీయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): చిన్న వయసులోనే వాకర్స్ క్లబ్‌లో చేరటంతో పాటు ప్రజల అవసరాలను గుర్తించి దానికి అనుగుణంగా సేవలు అందించటం అభినందనీయమని ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షుడు వి.మురళీ మోహన్, డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ అన్నారు. ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షుడు వి.మురళీ మోహన్ ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్స్ విజిట్‌లో భాగంగా బీఆర్టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టు గెదర్ వాకర్స్ క్లబ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ ద్వారా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు తాము చూసిన వాకర్స్ క్లబ్‌లో ఈ క్లబ్ సభ్యులు చిన్న వయసులోనే సేవలు అందిస్తున్నారని అభినందించారు. అనంతరం నిత్యావసర సరుకులు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ రావి కృష్ణారావు, క్యాబినెట్ ట్రెజరర్ మురళీ కృష్ణ, డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, కోరంగి నాగమల్లిక, ఎస్‌కె షఫీవుల్లా, రహీమా, హేమంతరావు తదితరులు పాల్గొన్నారు.

గౌరిదేవిగా దర్శనమిచ్చిన భ్రమరాంబ అమ్మవారు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని పురాతన ఆలయమైన పాతశివాలయంలో భ్రమరాంబ అమ్మవారు ఆదివారం శ్రీగౌరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయ ధర్మదాయశాఖకు చెందిన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం(పాతశివాలయం)లో కార్తిక నక్తదీక్షా మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అందులో భాగంగా శ్రీ భ్రమరాంబ అమ్మవారు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆ క్రమంలో అమ్మవారు ఆదివారం గౌరదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారికి ఖడ్గమాల, త్రిశతి, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీమల్లేశ్వరస్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన, ఆలయ ప్రదక్షిణలు, పంచహారతులు తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

శ్రీనివాస్ ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం


శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న శేషగిరిరావు తదితరులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): అటవీశాఖ అమర వీరుల దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ కీర్తిచక్ర పురస్కార గ్రహీత, కర్ణాటక క్యాడర్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్ వర్ధంతిని భవానీపురంలో ఆదివారం నిర్వహించారు. ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్వీ శేషగిరి రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శేషగిరిరావు మాట్లాడుతూ పలు రాష్ట్రాలను గడగడలాడించిన గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను అరెస్ట్ చేసిన శ్రీనివాస్ మన తెలుగువాడు, బీసీ సామాజికవర్గానికి చెందిన వాడు కావడం గర్వకారణమన్నారు. కర్ణాటక రాష్ట్రంలో శ్రీనివాస్ చేసిన సేవలకు గుర్తింపుగా కీర్తి చక్ర పురస్కారాన్ని పొందడం, విగ్రహాలను ఏర్పాటు చేయడం శ్రీనివాస్ నీతి నిజాయితీలకు నిదర్శనమన్నారు. యువత శ్రీనివాస్ ధైర్య సాహసాలను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. భవానీపురం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాదాల తిరుపతిరావుయాదవ్, టీ పూర్ణయ్య, పి.వెంకటేశ్వరరావు, పోతిన రాంబాబు, మురళీకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తజన కోలాహలం


దుర్గగుడి క్యూలైన్లలో భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వరస సెలవుల నేపథ్యంలో ఆదివారం రికార్డు స్థాయిలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి దుర్గమ్మను దర్శించుకున్నారు. తెల్లవారుజామున 5 గంటల నుంచే క్యూలైన్లలో భక్తుల తాకిడి కనిపించింది. ఆదివారం ఒక్క రోజే సుమారు 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు. తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. నటరాజ స్వామి వారి ఆలయం వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి పలువురు భక్తులు కుంకుమార్చనలు, సహస్ర నామార్చనలు జరిపించుకున్నారు. భక్తుల తాకిడికి హెడ్ వాటర్‌వర్క్‌వద్ద రోడ్డుకు ఇరువైపులా భారీగా కార్లు, ఇతర రవాణా వాహనాలను నిలిపి, దేవస్థాన బస్సుల్లో కొండపైకి చేరుకున్నారు. తెల్లవారుజామున భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన దుర్గమ్మను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ ఈవో కె.ఎస్.రామరావు క్యూలైన్లను పర్యవేక్షించారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతులు, పల్లకీ సేవలతో పాటు మల్లేశ్వరస్వామికి దీపార్చన, ఊంజల్ సేవలు జరిగాయి.

లోక కల్యాణార్థం సూర్యోపాసన సేవ

లోక కల్యాణార్థం, సర్వ మానవాళి సంక్షేమాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి పూజలు చేశారు.

భారతీయ సంస్కృతికి ప్రతీకలు కళలు


ఆర్ట్ ఆఫ్ ఏపీ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, చిత్రంలో కళాసాగర్, బొండా జగన్‌మోహన్‌రావు, సీవీ రాజు

భవానీపురం(విజయవాడపశ్చిమ): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు కళలు ప్రతీకలని, వాటిని మరింత ప్రోత్సహించాల్సిన బాధ్యత కళాప్రియులపై ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. భవానీపురం హరిత బెరంపార్క్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో 64 కళలు డాట్ కాం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన 64 కళలు డాట్ కాం సంపాదకుడు కళాసాగర్ యల్లపు రూపొందించిన 'ఆర్ట్ ఆఫ్ ఏపీ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత, కవి గంటేడ గౌరు నాయుడు రాసిన 'కైమోడ్పులివే కళల లోగిళ్లకు' పాటను కూడా ఆవిష్కరించారు. పద్మశ్రీ అవార్డ్‌గ్రహీత సీవీ రాజు '64కళలు డాట్ కాం స్ఫటిక జయంతి సంచికను ఆవిష్కరించారు. అనంతరం మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ జనాన్ని జాగృతం చేయడంతోపాటు వారికి మానసిక ప్రశాంతత చేకూర్చేవి కళలని పేర్కొన్నారు. 64 కళలు అనేవి మానవ జీవ పరిణామ దశలో ఒక భాగమన్నారు. భాషకన్నా ముందే చిత్రకళ పుట్టిందని, చతుష్షష్టి కళల్లో అగ్రభాగాన నిలిచేది చిత్ర, శిల్ప కళలేనన్నారు. రెండు తరాల కళాకారులకు వారధిగా, వందేళ్ల కళా చరిత్రకు దర్పణంలా కళాసాగర్ సారథ్యంలో రూపొందిన ఆర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పుస్తకం ఒక అద్భుతమని కొనియాడారు. కార్యక్రమాన్ని ప్రముఖ గీత శిల్పి, గిరిజన చిత్రాల చిత్రకారుడు డాక్టర్ బొండా జగన్మోహన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా, ఆంధ్రా యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ వి.రమేష్, కవి గంటేడ గౌరునాయుడు, టాక్ షో ప్రయోక్త కిరణ్‌ప్రభ, జానపద కళాకారుడు దామోదర గణపతిరావు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

13న భిన్నత్వంలో ఏకత్వం కార్యక్రమం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఈ నెల 13వ తేదీ బుధవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు విజయవాడ బందరురోడ్డులోని డీవీ మానర్ హోటల్‌లో భిన్నత్వంలో ఏకత్వం పేరుతో సదస్సు నిర్వహిస్తున్నామని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ షిబ్లీ చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో ఆదివారం ఉదయం విలేకరుల సమావేశం జరిగింది. ఫారూఖ్ షిబ్లీ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా తమ సమితి మత సామరస్యం కోసం కృషి చేస్తుందన్నారు. 13వ తేది జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్, గౌరవ అతిథులుగా ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, మైనార్టీ, న్యాయ వ్యవహారాల శాఖా మంత్రి ఎన్ఎండీ. ఫరూక్, మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ పాల్గొంటారన్నారు. సమావేశం అనంతరం భిన్నత్వంలో ఏకత్వం కార్యాక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి కానన్ త్రివేది, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఏపీ ప్రతినిధులు పి.సీత, కె.ఫాల్గుణరావు, పి.రవికిరణ్, జి.అనూప్, సురేష్, డాక్టర్ వినోద్, కె.హారిక, సీహెచ్ మోహన్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

17 నుంచి శృంగేరీ పీఠం ఉత్తరాధికారి విజయయాత్ర


శారద చంద్రమౌళీశ్వర్లు పూజల కోసం తయారు చేసిన రథం

విజయవాడ కల్చరల్: దక్షిణామ్నాయ శారదా పీఠం శృంగేరి ఉత్తరాధికారి జగద్గురు విధుశేఖర భారతీస్వామి విజయయాత్రలో భాగంగా ఈ నెల 17నుంచి 20వ తేదీ వరకు నగరంలో విడిది చేస్తున్నట్లు శివరామకృష్ణ క్షేత్రం ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ ఆదివారం తెలిపారు. 17వ తేదీ సాయంత్రం వన్‌టౌన్ వినాయకుని గుడినుంచి విజయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. దేవాలయంలో పనిచేసే అర్చక స్వాముల కోసం శృంగేరీ పీఠం సుమారు రూ. 3 కోట్ల వ్యయంతో నివాస గృహాలను, ధార్మిక కార్యక్రమాల కోసం నిర్మించిన భవనాలను స్వామి తొలి రోజు యాత్రలో ప్రారంభిస్తారు. స్వామిజీ నాలుగు రోజుల కార్యక్రమంలో శివరామ కృష్ణ క్షేత్రం, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, సత్యనారాయణపురంలోని పాదుకా క్షేత్రం, మారుతీ వ్యాయామశాల, యనమలకుదురు దేవాలయాల్లో పూజలు చేస్తారు. ధర్మయ సంరక్షణకే విజయయాత్ర చేస్తున్నట్లు శిష్టా హనుమత్ ప్రసాద్ చెప్పారు. శారదాచంద్రమౌళీశ్వరుల పూజల కోసం ప్రత్యేక రథం చేయించామని తెలిపారు.




కార్తికమాస సందడి

కార్తిక మాస ఆదివారం సందర్భంగా విజయవాడ భవానీపురం భవానీ ఐలాండ్‌లో సందర్శకులు కార్తిక మాస వనభోజనాలు చేశారు. కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులతో తరలివచ్చి ఆటపాటలతో సంతోషంగా గడిపారు. చిన్నారులు, యువత కేరింతలు కొట్టారు. ఐలాండ్ అంతా కలియతిరిగి సెల్ఫీలు, గ్రూప్ ఫొటోలు తీసుకుంటూ సందడి చేశారు. కొందరు యువకులు స్పీడ్‌బోటులో కృష్ణానదిలో రైడ్ చేశారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ






వాగ్దానాలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

కృష్ణలంక(విజయవాడతూర్పు): మోసపూరిత హామీలిచ్చి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా విస్మరించిందని సీపీఎం నాయకులు మండిపడ్డారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమన్న హామీని తుంగలో తొక్కి రూ.17 వేల కోట్ల విద్యుత్ సర్దుబాటు చార్జీల భారాలను ప్రజలపై మోపుతుందన్నారు. చౌకైన మద్యం కాదు నిత్యావసర సరుకులు చౌకగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కృష్ణలంక రాణిగారితోటలోని 17వ డివిజన్, 22వ డివిజన్‌లోని భ్రమరాంభపురంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాపోరు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలు నియంత్రణ, విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు, నిరుద్యోగ భృతి, ఉపాధి కల్పించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాల్ని అమలు చేస్తుందన్నారు. కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తూ ఆ భారాలను ప్రజలపై మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14వ తేదీన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నా కార్యక్రమంలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పి.కృష్ణ, నగర నాయకులు టి.చంద్రశేఖర్, వై.కృష్ణ, కోటిరెడ్డి, అప్పలనాయుడు, ఆదాం, రమాదేవి పాల్గొన్నారు.